క్లుప్తంగా

10 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు


పిచ్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

కొయ్యూరు: ఈనెల 10వ తేదీ నుంచి జరగనున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు పోలీసు గ్రౌండ్ సిద్ధమవుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు మైదానం పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో కూలీలతో గ్రౌండ్‌లో మొక్కలు లేకుండా చేశారు. దీంతో పాటు పిచ్ తయారీకి ప్రత్యేకంగా చేపట్టారు. రోలర్‌తో మైదానాన్ని సరిచేశారు. జిల్లాస్థాయి పోటీలకు నిర్వాహకులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు 30 మంది పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీలను పంపినట్టు నిర్వాహకులు వేణు, సురేష్ తెలిపారు. 20 ఓటర్లకు ఆట ఉంటుందన్నారు. ఈనెల పది నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. టోర్నీలో మొదటి బహుమతిగా రూ.50వేలతో పాటు ట్రోఫీని ఇస్తామన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుని కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆర్జీ గురుబరి(46) కుటుంబానికి గుంటసీమ సర్పంచ్ గుమ్మా నాగేశ్వరరావు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ తన సొంత నిధులు రూ.5వేలు ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అందజేసినట్టు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి తన వంతు సాయం అందజేస్తున్నట్టు చెప్పారు. గ్రామస్తుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి


రోడ్డు,డ్రైనేజీ లేని బడిమెల గ్రామం

డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయితీ బడిమెల గ్రామంలో డ్రైనేజీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. గ్రామాల్లోని వాడుకనీరు రోడ్లపై పారుతోందంటున్నారు. వర్షం పడితే రహదారులు అధ్వానంగా మారుతున్నాయని, మురుగునీరు ముంచెత్తుతోందని చెబుతున్నారు. తీవ్ర దుర్గంధంతో సతమతమవుతున్నామని, దోమలు బెడద ఎక్కువగా ఉందని, రోగాలు ప్రబలే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీతో పాటు రహదారి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నతులుగా ఎదగాలి


పది, ఇంటర్ టాపర్ విద్యార్థులను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

కొయ్యూరు: పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం మల్లవరంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు సన్మానించారు.విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరాలని సంస్థ ప్రతనిధి టి.మల్లేశ్ ఆకాంక్షించారు. గ్రామంలో డిఎస్సీ రాసేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థి కూడా దారబాబుకు రూ. 3,800 ఆర్థికసాయం అందజేసినట్టు ఆయన చెప్పారు.
గ్రామంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తాళాబు యువరాజ్‌కు రూ.8వేలు అందజేశామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ప్రణాళిక బద్ధంగా చదవాలన్నారు. చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఉన్నత విద్య అభ్యసించి, మంచి హోదాల్లో విద్యార్థులు స్థిరపడి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు సన్యాసిరావు, చిట్టయ్య, రామరాజు, లక్ష్మణరావు, మల్లయ్య, సింహాచలం, సన్ని, లక్ష్మయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


బూసిపుట్టుకు గ్రామంలోని తారురోడ్డు


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బుంగాపుట్టు గ్రామానికి నిర్మించిన రోడ్డు

ప్రగతి చక్రం.. పల్లెకు దూరం

- ప్రైవేట్ వాహనాలే దిక్కుగా మారిన వైనం
- బస్సు సర్వీసులకు నోచుకోని 80 గ్రామాలు
- పట్టించుకోని అధికారులు


ప్రైవేట్ జీపులో ప్రయాణిస్తున్న లక్ష్మీపురం గిరిజనులు


కాలినడకన వెళ్తున్న రంగబయిలు గిరిజనులు

ముంచంగిపుట్టు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరిజన గ్రామాలకు పక్కా రహదారులు మంజూరయ్యాయి. నాడు జగన్ ప్రభుత్వంలో మారుమూల గ్రామాలకు సైతం తారురోడ్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో దశాబ్దాలుగా అస్తవ్యస్త రహదారులతో అవస్థలు పడుతున్న గిరిజనులకు ఎంతో ఊరట కలిగింది. అయితే ప్రస్తుతం విశాలమైన రహదారులు తారురోడ్లు ఉన్నా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. కాలిబాటన రాకపోకలు సాగిస్తున్నారు. కొందరూ గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అధిక చార్జీల వసూళ్లతో పాటు కిక్కిరిసిన ప్రయాణికులతో భయం భయంగా ప్రైవేట్ వాహనాల్లో గిరిజనులు రాకపోకలు సాగిస్తున్నారు.

విస్తారంగా నూతన తారురోడ్లు

మండలంలో సుజనకోట పంచాయతీ కేంద్రానికి, సుజనపేట, బీటా, వనుగుపుట్టు, రంగబయలు పంచాయతీ కేంద్రానికి, భూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి, దారెల పంచాయతీ కేంద్రంలో పాటు పెద్దపేట, లక్ష్మీపురం, బరడ, బుంగాపుట్టు పంచాయతీ కేంద్రాలకు పక్క తారు రోడ్లు ఉన్నాయి. కానీ ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించడంలో విఫలమయ్యారు. తారురోడ్లు ఉన్నా సుమారు 80 గ్రామాలకు చెందిన గిరిజనులకు ప్రైవేట్ వాహనాలే దిక్కుగా మారాయి.
ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులతో అతివేగంతో వెళ్తూ ఉండడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి.
మండలంలోని పలుమార్లు జరిగిన ప్రమాదాల్లో అమాయక గిరిజనులు కొందరు మృత్యువాతకు గురికాగా, మరికొందరు గాయాలుపాలైన సంఘటనలు కోకొల్లలు. ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక వారపు సంతలకు గిరిజనులు పండించి, సేకరించిన ఉత్పత్తులను మార్కెట్ తరలించడానికి నానా అవస్థలు పడుతున్నారు. రహదారులు ఉన్న గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని తారురోడ్లు ఉన్న గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



తారురోడ్డు సౌకర్యం కలగడం చాలా సంతోషంగా ఉంది. కానీ బస్సు సర్వీసు లేక నిత్యం అవస్థలు పడుతున్నాం. ముఖ్యంగా అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను వారపు సంతలకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి, మా రాకపోకలకు పడుతున్న కష్టాలు తీర్చాలి. – కె.బుద్రీ, దొరగూడ గ్రామం, ముంచంగిపుట్టు మండలం

కాలినడకన సంతలకు



లక్ష్మీపురం,బుంగాపుట్టు పంచాయతీ కేంద్రాలకు పక్కా రహదారులు ఉన్నాయి. ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని అనేకసార్లు అధికారులకు కోరినా స్పందన లేదు.ప్రైవేట్ వాహనాలే దిక్కుగా మారాయి. పంచాయతీ కేంద్రాలకు వెళ్లే ఉద్యోగులు, ఉపాధ్యాయులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది గిరిజనులు వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను మోసుకుంటూ కాలినడకన వారపు సంతలకు వెళ్తున్నారు.తక్షణమే ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీసు నడపాలి. – కె.త్రినాథ్, సర్పంచ్, లక్ష్మీపురం పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

చర్యలు తీసుకుంటాం

మండలంలో బస్సు సౌకర్యం లేని గ్రామాలను గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సుజనకోట, రంగబయలు, లక్ష్మీపురం, దారెల పంచాయతీలకు బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు ఆర్టీసీ అధికారులతో చర్చిస్తాం. పలు గ్రామాల గిరిజనులు బస్సు సర్వీసుపై వినతులు సైతం అందించారు. – సూర్యనారాయణమూర్తి, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

తాగునీటి బోరు నిర్మాణ పనులు ప్రారంభం


బోరు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ బాలయ్యపడాల్, సర్పంచ్ గోపాల్

చింతపల్లి: మండలంలో లోతుగెడ్డ జంక్షన్‌లో తాగునీటి బోరు నిర్మాణ పనులను జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్, సర్పంచ్ సమిడి గోపాల్ సోమవారం ప్రారంభించారు. పెదబరడ పంచాయతీ పరిధిలోని లోతుగెడ్డ జంక్షన్‌లో శ్మశానవాటిక వద్ద జిల్లా పరిషత్ నిధులతో బోరు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు నాగూర్, గ్రామస్తులు శ్రీను, రమణ, సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

వాచ్‌మన్‌కు పూర్వ విద్యార్థుల సాయం


పాఠశాల వాచ్‌మన్‌కు ఆర్థికసాయమందిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: స్కూల్ వాచ్‌మన్‌కు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయమందించారు. జడ్డంగి జెడ్పీ హైస్కూల్ 1987–88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల వాచ్‌మన్ వెంకటరావుకు రూ.10వేలు అందజేశారు. కొద్ది రోజుల్లో రిటైర్ కానున్నారని, అయినా అతని ఉద్యోగం పర్మినెంట్ కాలేదని పూర్వ విద్యార్థులు విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ వంతు సాయంగా వెంకటరావుకు ఆర్థిక సాయం చేశామన్నారు.

ఆదివాసీల సభను విజయవంతం చేయాలి


సభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

ఎటపాక: ఈనెల 16న చింతూరులో జరగనున్న ఆదివాసీ హక్కుల గర్జన సభను విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కన్వీనర్ గుండి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. దమ్మక్కగూడెంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీల ఉద్యోగ భద్రతకు 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాలు స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలని కోరారు. గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సమస్యలపై చేపట్టనున్న గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. వెంకటమ్మ, నాగేశ్వరరావు, నాగమణి, నర్సింహారావు, వెంకటలక్ష్మి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు పంచాయతీల ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మండల స్థాయిలో ఈ నెల 5న అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించినట్టు ఎంపీడీవో చెప్పారు. ఆరో తేదీన సచివాలయాల పరిధిలో సమావేశాలు జరుగుతాయన్నారు. పంచాయతీలకు సంబంధించి ఉన్న ఆస్తుల పరిరక్షణకు ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈవోపీఆర్డీ పాపారావు, ఆర్‌అండ్‌బీ, పీఆర్ జేఈలు జ్యోతిబాబు, భరత్, ఎస్‌ఐ అప్పలసూరి, డీటీ సత్యనారాయణ ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై వెల్లువెత్తిన అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న పీవో సింహాచలం


ఐటీడీఏ పీవో సింహాచలంకు వినతిపత్రం అందజేస్తున్న బూరుగపల్లి గ్రామస్తులు

రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ సమావేశపు హాలులో సోమవారం పీవో కట్టా సింహాచలం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. రాజవొమ్మంగి మండలం ఓయడ గ్రామం మీదుగా బోరుగుపల్లి మధ్యలో నిలిచి పోయిన రోడ్డు పూర్తి చేయాలని కనిగిరి దుర్గాప్రసాద్, సోముల చిన్నబ్బాయి గిరిజనులు అర్జీ అందజేశారు. మారేడుమిల్లి మండలం కుట్రవాడ గ్రామంలో సత్యసాయి వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న 35 మందికి 24 నెలలు నుంచి వేతనాలు చెల్లించడం లేదని రాంబాబు, దాసు, బాలరాజు తదితరులు పీవోకు ఫిర్యాదు చేశారు. పందిరి మామిడి– చవిటిదిబ్బలు మధ్యలో నిలిచిపోయిన పది కిలోమీటర్ల రోడ్డును పూర్తి చేయాలని గిరిజనులు కోరారు. ఈ రోడ్డు వలన 130 గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని పాలగెడ్డ గ్రామం నుంచి బొడ్డగండి వరకు ఏడు కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని గిరిజనులు శరంకోట అబ్బాయిరెడ్డి, నైని పండయ్య కోరారు.ఉత్తలూరు గ్రామానికి నాలుగు కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని పల్లాల కృష్ణారెడ్డి తదితరులు కోరారు. ఈ వారం 34 అర్జీలు వచ్చినట్లు పీవో తెలిపారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

రాజవొమ్మంగి: తమ గ్రామానికి అసంపూర్తిగా వదిలిపెట్టిన బీటీ రోడ్ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కోరుతు మండలంలోని రాజవొమ్మంగి పంచాయతీ, బూరుగపల్లి, వయ్యేడు గ్రామస్తులు సోమవారం రంపచోడవరలో జరిగిన గ్రీవెన్స్‌లో ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలంలకు వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్టర్ ఈ రహదారిపై కంకర మాత్రమే పరచి మిగతా పనులను అర్ధంతరంగా వదిలిపెట్టినట్లు గ్రామస్తులు వినతిలో పేర్కొన్నారు. అత్యవసర సరిస్థితుల్లో మండల కేంద్రం రాజవొమ్మంగికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. వినతి ఇచ్చిన వారిలో గ్రామస్తులతో పాటు రాజవొమ్మంగి వైఎస్సార్‌సీపీ నాయకుడు కనిగిరి దుర్గాప్రసాద్, నాగులపల్లి కుశరాజు తదితరులున్నారు.

గాలివాన బీభత్సంతో దెబ్బతిన్న పాఠశాల పైకప్పు రేకులు


గాలివానకు దెబ్బతిన్న పాఠశాల పైకప్పు

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ చంపాపుట్టు గ్రామంలో గాలివాన బీభత్సం సృష్టించాయి.ఆదివారం రాత్రి దట్టంగా ఎదురుగాలులతో భారీ వర్షం పడింది. దీంతో గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి.ధ్వంసం అయ్యాయి. పాఠశాల సామగ్రి దెబ్బతిన్నట్టు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం పాఠశాలకు సెలవు కావడంతో పెనూ ప్రమాదం తప్పిందని చెప్పారు. సోమవారం ఉదయం గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయుడు కిముడు భాగత్రాంకు తెలియజేయడంతో చంపాపుట్టు వెళ్లి పాఠశాలను పరిశీలించి, జరిగిన విషయాన్ని ఎంఈవో కృష్ణమూర్తికి తెలియజేశారు. పాఠశాల ప్రారంభం నాటికి విద్యాశాఖ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పాఠశాల పైకప్పు మరమ్మతులు చేయిస్తామని ఎంఈవో కృష్ణమూర్తి చెప్పారు.

8 నుంచి కల్యాణోత్సవాలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని మెయిన్‌రోడ్ సిద్ధిలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు గోకర్ణేశ్వరస్వామి బాలత్రిపుర సుందరీదేవి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ కృష్ణాజీ తెలిపారు. 8న విఘ్నేశ్వర పూజ, సాయంత్రం కల్యాణం జరుగుతుందన్నారు. 9న కల్యాణ పంచ శోభా హారతులు, 10న సాయంత్రం పండిత గోష్టి, 11న నాగవల్లి కార్యక్రమం, 12న పుష్పాంజలి, ప్రతీరోజు సాయంత్రం భజన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

గ్రామాల్లో భూఆక్రమణలపై సర్వే


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ చంద్రశేఖర్

చింతపల్లి: మండలంలో గ్రామ స్థాయిలో ఆక్రమణలకు గురైన భూములను గుర్తించడానికి పూర్తి స్థాయి సర్వే నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లోను పంచాయతీ, గ్రామ కంఠం స్థలాలతో పాటు ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతానికి గురైతే ఈ సర్వేలో గుర్తించాలన్నారు. ఈ సర్వేకు సంబంధించి గ్రామ స్థాయి, పంచాయతీ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు.డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడాలని వినతి



డీటీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ అధ్యక్షుడు శశికుమార్ తదితరులు

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తే ఉపేక్షించేది లేదని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దేపూరి శశికుమార్ హెచ్చరించారు. మండల కార్యాలయం ముందు సోమవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యా వ్యవస్థ నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం 1, 2 తరగతులను విలీనం చేసే ప్రక్రియకు నాంది పలుకుతుందని. దీంతో ఏజెన్సీలో గిరిజన విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిర్ణయాన్ని పునరాలించుకోవాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు చంద్రరావు, మహేష్, సురేష్ ,వెంకటేశ్వర్లు, కామేశ్వరరావు, పాత్రుడు, చిట్టినాయుడు తదతరులు పాల్గొన్నారు.

కనులపండువగా అమ్మవారి జాతర


ఉత్సవాలను తిలకిస్తున్న అఘోరీ హనునాథ్ మహారాజ్


ఊరేగింపులో భక్తులు

అడ్డతీగల: అడ్డతీగల మండలం వేటమామిడి చిన్నమస్తా రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాలు రెండవరోజు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ముర్ల రాజారెడ్డి ఆధ్వర్యంలో సుమంగళి పూజ జరిగింది. అనంతరం 108 సుమంగళి స్త్రీలకు వాయన ప్రధానం గావించారు. కాళీ నృత్యం, గరగల సంబరం, కేరళ సంప్రదాయపు వాయిద్యాలతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు భ ఆకట్టుకుంది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. అఘోరీ హనునాథ్ మహారాజ్ విచ్చేసి జాతర ఉత్సవాలను తిలకించారు. అమ్మవారి మహాకుంబ బలి పూజ మేళ తాళాల మధ్య శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు


సిద్ధంగా ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

కొయ్యూరు: ఖరీఫ్‌లో నాట్లు వేసేందుకు ముందుగా పంటకు బలం చేకూరేందుకు అవసరమైన పోషకాలను అందించే పచ్చిరొట్ట విత్తనాలు ఎంతగానో ఉపయోగపడతాయని మండల వ్యవసాయాధికారి ఉమాదేవి చెప్పారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 2400 కిలోల పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. ఇందులో జనుము విత్తనాలు 1400 కిలోలు ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా వివిధ రకాల అపరాల విత్తనాలను కలిగిన ఎనిమిది కిలోల బ్యాగ్‌లతో టన్ను వచ్చినట్టు తెలిపారు. వాటిలో ఎనిమిది రకాలు ఉంటాయి. ఎకరాకు ఎనిమిది కిలోల వరకు ఆ విత్తనాలను వేయవచ్చని సూచించారు. త్వరలో పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. గడచిన కొన్ని రోజుల నుంచి వర్షాలు కురవడంతో మొక్కజొన్నతో పాటు కొన్ని రకాల పంటలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఆకుమడులు వేసేందుకు దుక్కులు దున్నుతున్నారు. దీనికి ముందుగా రైతులు పచ్చిరొట్ట విత్తనాలు పొలాల్లో వేయనున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు- ఆవు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆవు


ఆవును ఢీ కొట్టి గాయాలపాలైన వాహనచోదకుడు దుర్గాప్రసాద్

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని మసీదు వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో సాగిన దుర్గాప్రసాద్ (25) మోటారు సైకిల్‌పై వెళ్తూ ఆవును ఢీ కొట్టి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. కాగా ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. యువకుడిని స్థానికులు స్థానికులు పీహెచ్‌సీకు తరలించగా చికిత్స పొందుతున్నాడు.
తల్లి ఆవు చనిపోవడంతో దాని లేగదూడ బేలగా చూసిన చూపులు స్థానికులకు కన్నీరు తెప్పించాయి. రైతులు తమ పశువులను విచ్చలవిడిగా రోడ్లపై వదిలి పెడుతుండడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపల్లి వద్ద..

మండలంలోని కొండపల్లి వద్ద జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో మోటారిస్టు చింతకాయల కిశోర్ (23) తీవ్ర గాయాలపాలయ్యాడు. కిషోర్ స్వగ్రామం అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం చిన్నయ్యపాలెం. మండలంలోని ఒట్టిగెడ్డ గ్రామంలోని బంధువుల ఇంటికి వస్తుండగా రోడ్డుపై గల కంకర గుట్టను ఢీ కొట్టి వాహనం అదుపు తప్పి కిషోర్ కింద పడిపోయాడు. స్థానికులు అతడిని హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం ఏలేశ్వరం ఆస్పత్రికి తరలించారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


ముంచంగిపుట్టులో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలని కిలగాడ వైద్యాధికారి శిరీష అన్నారు. మండల కేంద్రంలో పలు ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీని వైద్యాధికారి శిరీష ఆధ్వర్యంలో సోమవారం వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో వర్షపు నీరు నిలిచి ఉండడంతో దోమలు పెరిగే అవకాశాలు ఉన్నాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ తెరలు వినియోగించాలని సూచించారు. దోమల నివారణకు కృషి చేయాలని ఆమె కోరారు. సీహెచ్‌వో సొడప్పడు, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ అశోక్, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.